# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 16-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:10 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

ప్రీతికరంబుగ విబుధులు
ఊతము నందించి భారతోత్సవములలో
నీతికి భారత జాతికి
ఖ్యాతిని గలిగించి రమెరికా దేశములోన్ !!

(అమెరికా లోని ఎన్నో రాష్ట్రాలలో భారత దినోత్సవాన్ని నిర్వహించి చాల గొప్ప వారు మన ప్రతిభను ప్రపంచానికి చాటుతున్నారు. ఇది భారతీయులందరికీ గర్వకారణం.)

-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

హర్ ఘర్ తిరంగా
ఆకాశం ఎగిరే జోరు
సాధించిన ఫలితాలు
స్వార్థానికి కరిగే హోరు
స్వాతంత్ర్యం ఎనబై ఏళ్ల
సంబరాల్లో అంతా జోష్
ఆర్థిక అభివృద్ధి దేశం
అంతరాల్లో మునిగే ఫేష్

-వేల్పుల నారాయణ
9440433475

# మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసి క్రెడిట్ తీసుకోండి..

# విపక్షాలకు ప్రధాని మోదీ పిలుపు





న్యూఢిల్లీ, ఆగష్టు 15: డీలిమిటేషన్‌తో లింకున్న మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసేలా మద్దతు ఇవ్వాలని, ఆ తర్వాత ఆ అంశంలో క్రెడిట్ తీసుకోవాలని విపక్షాలను ప్రధాని మోదీ కోరారు. గడిచిన 40 ఏళ్ల నుంచి మహిళా రిజర్వేషన్ అంశం రాజకీయ అకాడాలో ఉండిపోయిందన్నారు. 131వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు 33 రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. 2029 నాటికి చట్టసభల్లో మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించాలంటే.. లోక్‌సభలో సీట్ల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాల్సిన అవసరం ఉన్నది. మూడో వంతు మెజారిటీ ఆమోదిస్తేనే దిగువ సభలో ఆ బిల్లు పాసవుతుంది. అయితే 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడిన మోదీ.. రాజ్యాంగ సవరణకు ఆమోదం తెలిపి, రాజకీయ జాతీయ పతాకం నీడలో నిలుచుని మాట్లాడుతున్నానని, అన్ని రాజకీయ పార్టీలకు అప్పీల్ చేస్తున్నానని, మహిళలను గౌరవించాల్సిన సమయం వచ్చిందని, అసెంబ్లీలు.. లోక్‌సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలను గౌరవించాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఏప్రిల్ 17వ తేదీన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. ఆ బిల్లుకు మద్దతుగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. అయితే ఆ బిల్లు నెగ్గాలంటే 352 ఓవర్ల అవసరం ఉండే. కానీ ఆ బిల్లు వీగిపోవడంతో.. ప్రధాని మోదీ మరుసటి రోజు దేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. విపక్షాల వల్ల మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ కాలేదన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

-సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ.
-స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాల పంపిణీ.




సంగారెడ్డి, ఆగష్టు 15(నేటి నిజం ప్రతినిధి)నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అనంతరం ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని మంత్రి వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, ఆగస్టు 15: సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయ ంలో టాప్‌లో ఉన్నామ న్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నా్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలం గాణ రిక్కాలు సృష్టించిందని తెలిపారు.

కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నా మని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరు లను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, 2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు.

దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ఎఉఖూఅని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల అవసరాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

ఖమ్మం, ఆగష్టు 15: తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.



తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్



హైదరాబాద్, ఆగష్టు 15:తెలంగాణ భవన్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నారని అన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెలాఖరులోగా మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి:

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగష్టు 15:రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. ఈరోజు(శనివారం) అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్‌లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# పవన్‌కు తీవ్ర జ్వరం..

అమరావతి, ఆగష్టు 15:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర జ్వరం కారణంగా ఈ సాయంత్రం లోక్ భవన్‌లో నిర్వహించే "ఎట్ హోమ్" కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నారు. ఈ విషయాన్ని లోక్ భవన్ అధికారులకు తెలిపారు. శనివారం ఉదయం కాకినాడలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు.

ఆ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించుకున్నారు. రాజమహేంద్రవరంలో వైద్యులు ఉప ముఖ్యమంత్రి వర్యులను పరీక్షించారు.




# అలుపెరుగని పోరాట యోధుడు గౌతు లచ్చన్న

## ఆగస్టు 16...సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమిందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది.



గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 – ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యే?క రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు.

బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చే?రి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాథం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929–30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది.

1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు.

ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా– లచ్చన్నల సంబంధం.

1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే.

దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమిందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు.

1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు.

### 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన

స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు.

1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు.

పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు



-మధుపాళీ
9949700037

# చెన్నూరులో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



ఆదిలాబాద్, ఆగష్టు 15: మంచిర్యాల జిల్లాచెన్నూరు నియోజకవర్గంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు.

స్థానిక మున్సిఫ్ కోర్టులో జడ్జి పర్వతపు రవి, పోలీస్ స్టేషన్ లో సీఐ బన్సీలాల్, మున్సిపల్ కార్యాలయంలో చెర్ పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్ లు జాతీయజెండా ను ఆవిష్కరించాగా, క్యాంప్ కార్యాలయం లో కౌన్సిలర్ మంత్రి లక్ష్మణ్,అంబేద్కర్ చౌక్ లో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తగరం వెంకటి,జ్యోతి బాపురావ్ పూలే విగ్రహం వద్ద బిజెపి చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జ్ దుర్గం అశోక్, సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి నేన్నెల సమ్మయ్య లు, ప్రభుత్వ పాఠశాల, లాలాశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ జెండాలు ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన బీఎస్ఎన్ఎల్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 15:భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తమ విలువైన వినియోగ దారుల ు, దేశ పౌరులందరికీ, వ్యాపార భాగస్వాములకు, సహచరులకు, ఉద్యోగులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది.

దేశంలో విశ్వసనీయమైన ప్రభుత్వ రంగ టెలికాం సేవా సంస్థగా ఉన్న బీఎస్ఎన్ఎల్, క్లిష్టమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితుల్లో కూడా నాణ్యమైన సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా నమ్మకమైన, సురక్షితమైన, సరసమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ అనుసంధానాన్ని అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

# పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే సందర్భంగా విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని కొనియాడిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 15:పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే సందర్భంగా దేశ విభజన వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరి ధైర్య సాహసాలను స్మరించు కుంటున్నట్లు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ విభజన చరిత్రలో ఎన్నో జీవితాలను చిన్నభిన్నం చేసిందని, కుటుంబాలు చెల్లాచెదురయ్యాయని, ఎంతోమంది ప్రియమైన వారిని కోల్పోయారని, చెప్పలేనంత బాధను అనుభవించాల్సి వచ్చిందన్నారు.

కష్టాలను అధిగమించి ప్రజలు, వారి జీవితాలను పునర్నిర్మించుకున్నారని, ప్రతికూల పరిస్థితులను విజయంగా మలచుకుంటూ దేశ పురోగతికి తోడ్పాటు నందించారని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. సంకల్ప బలం ఎంత గొప్పదో వారి జీవిత ప్రయాణాలు మనకు తెలియజేసాయన్నారు. దేశంలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించుకోవాలన్న సంకల్పాన్ని ఈ రోజు మరింత బలపరుస్తుందని? వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టి కృషి చేసేలా స్ఫూర్తినిస్తుందని శ్రీ నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆ భయంకరమైన పరిస్థితుల నుంచి బయటపడి దేశ పురోగతికి కృషి చేసిన వారందరికీ ప్రధాన మంత్రి హృదయపూర్వక నివాళులు అర్పించారు. ప్రతి కూల పరిస్థితుల్లోనూ పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చని వారి ధైర్యసాహసాలు, సామర్థ్యాలు నిరూపించాయని పేర్కొన్నారు. దేశ సద్భావన, ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని శ్రీ నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు.

ఒక సుభాషితాన్ని ప్రస్తావిస్తూ.. శ్రమ, పట్టుదల, అంకితభావంతో కూడిన ప్రయత్నాల వల్లే వివిధ కళలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక నైపుణ్యాలు, హస్త కళలు, నూతన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని, ఇవి విజయానికి బాటలు వేస్తాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. కేవలం అదృష్టాన్ని నమ్ముకుని ఉండిపోకుండా? ధైర్యం, శ్రమ శక్తి, నిరంతర ప్రయత్నాలతో స్థిరంగా గమ్యం దిశగా సాగాలని తెలిపారు. మానవ ప్రయత్నాలే భవితవ్యాన్ని నిర్ణయిస్తాయన్నారు.

"ఇవాళ మనం పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే నిర్వహిస్తున్నాం. దేశ విభజన వల్ల ప్రభావితమైన వారి ధైర్యసాహసాలను ఈ సందర్భంగా స్మరించుకుందాం. విభజన వల్ల ఎన్నో జీవితాలు చిన్నాభిన్నమై.. మరెన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. ప్రియమైన వారిని కోల్పోయారు. ఎంతో వేదనను అనుభవించారు.

అదే సమయంలో ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు.

కష్టాలను విజయాలుగా మలచుకున్నారు. దేశ పురోగతికి ఎంతో కృషి చేశారు. వారి జీవిత ప్రయాణాలు సంకల్పబలాన్ని గుర్తుచేస్తాయి.

దేశంలో ఐక్యతను, సౌభ్రాతృత్వానని పరిరక్షించుకోవాలన్న సంకల్పాన్ని ఈ రోజు మరింత బలపరుస్తుందని.. వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టి కృషి చేసేలా స్ఫూర్తినిస్తుందని విశ్వసిస్తున్నా.

# జన్నారంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## విద్యార్థుల ప్రభాతబేరీ.. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



ఆదిలాబాద్, ఆగష్టు 15: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పలు సంస్థల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

జన్నారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బక్కయ్య, ఎఫ్డీఓ కార్యాలయంలో ఎఫ్డీఓ రామ్మోహన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కొనుగోలు సింగిల్ విండో కార్యాలయంలో ఛైర్మన్ అల్లం రవి, రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల వద్ద ఛైర్మన్ చంద్రశేఖర్, స్లేట్ స్కూల్ వద్ద ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, పొనకల్ గ్రామ పంచాయతీ వద్ద సర్పంచి జక్కు సుష్మ జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు నందు నాయక్, అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద బీజేపీ అధ్యక్షుడు మధుసూదన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు వి. వామన్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు జక్కు భూమేష్, టౌన్ అధ్యక్షుడు రాజేష్ తదితరులు జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ప్రభాతబేరి నిర్వహించి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు: మంత్రి ఉత్తమ్ కుమార్

సంగారెడ్డి, ఆగష్టు 15: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఃఖీా ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఃఖీా పార్టీలోని నేతలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ



ధాన్యాన్ని తెలంగాణలో పండిం చామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచి పోనుందన్నారు.

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. ఃఖీా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎత్తొండలో ప్లాస్టిక్ నిషేధం.. గ్రామపంచాయతీ తీర్మానం

కామారెడ్డి, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి)పర్యావరణాన్ని పరిరక్షించాలనే సదుద్దేశంతో 'ప్లాస్టిక్ వాడకం వద్దు స్టీల్ వాడకమే ముద్దు' అనే నినాదంతో ప్లాస్టిక్‌ను నివారించేందకు నడం బిగించింది నిజామాబాదు జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామం. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకున్నది. గ్రామంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ శ్వేత తెలిపారు ఎత్తొండ గ్రామంలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లు వాడకంపై పూర్తిగా నిషేధిస్తామని సర్పంచ్ అన్నారు. గ్రామంలోని నాలుగు హోటళ్లకు 200 స్టీల్ టీ గ్లాసులను సర్పంచ్ తరఫున పంపిణీ చేశారు.




# స్వావలంబన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రక్షణ రంగం ఆధ్వర్యంలోని సైనిక ఆధునికీకరణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

న్యూఢిల్లీ, ఆగష్టు 15:ఆత్మనిర్భరత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రక్షణ రంగం ఆధ్వర్యంలోని రక్షణ దళాల ఆధునికీకరణకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2026 ఆగస్టు 14 నాడు ఆకాశ్‌వాణి ద్వారా సైనికులను ఉద్దేశించి రక్షణ మంత్రి మాట్లాడారు. గత 12 సంవత్సరాల్లో 'ఆత్మనిర్భర్ భారత్', 'భారత్‌లో తయారీ' వంటి కార్యక్రమాల ద్వారా రక్షణ రంగంలో వచ్చిన పరివర్తనాత్మక మార్పుల గురించి మాట్లాడుతూ.. భారత్ సొంత భద్రతా అవసరాలను సమర్థవంతంగా తీర్చుకోవడంతో పాటు ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా, నికర రక్షణ ఎగుమతిదారుగా ఎదుగుతోందని ఆయన ఉద్ఘాటించారు.

2014లో కేవలం రూ. 46,000 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 1.78 లక్ష కోట్లకి పెరిగిందని.. గత దశాబ్ద కాలంలో ఇది దాదాపు నాలుగు రెట్లు వృద్ధి చెందిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఈ ఘనత రక్షణ రంగంలో వచ్చిన నిర్మాణపరమైన మార్పులకు నిదర్శనమని ఆయన అన్నారు. రక్షణ రంగం మొత్తం ఉత్పత్తిలో రక్షణ రంగ ప్రభుత్వ రంగాలు (డీపీఎస్‌యూ), ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు దాదాపు 76 శాతం వాటాను కలిగి ఉండగా ప్రైవేట్ రంగం 24 శాతంగా (గత ఆర్థిక సంవత్సరంలో ఇది 22 శాతంగా ఉండేది) ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ రంగానికి ఉన్న ఈ వర్ధమాన భాగస్వామ్యం రక్షణ రంగంలో నిరంతరం మెరుగుపడుతున్న వ్యాపార పరిస్థితిని తెలియజేస్తోందని ఆయన అన్నారు.

2013-14 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీవిత కాల గరిష్ఠ స్థాయి అయిన రూ. 38,424 కోట్లకు చేరాయని.. అంటే 5,500 శాతానికి పైగా వృద్ధ నమోదైందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఈ ఘనత రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత'కు అత్యంత బలమైన నిదర్శనమని ఆయన వివరించారు. "నేడు భారతదేశానికి చెందిన 145 రక్షణ ఎగుమతిదారులు ఉన్నారు. మన ఉత్పత్తులు 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2029 నాటికి రూ. 50,000 కోట్ల రక్షణ ఎగుమతుల లక్ష్యాన్ని మనం సాధిస్తామనే నమ్మకం నాకుంది" అని ఆయన అన్నారు.

2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.53 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 7.85 లక్షల కోట్లకు పెరిగిందని.. ఇది భవిష్యత్ రక్షణ సాంకేతికతల పట్ల పెరుగుతున్న భారత్ నిబద్ధతకు ప్రతీక అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. "మూలధన వ్యయం రూ. 94,588 కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు పెరిగింది. పరిశోధన, అభివృద్ధిపై (ఆర్-డీ) ప్రభుత్వం కూడా గట్టిగా దృష్టి సారిస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 15,283 కోట్లుగా ఉన్న ఆర్-డీ బడ్జెట్ 2026-27 నాటికి 90 శాతం పెరిగి రూ. 29,100 కోట్లకు చేరుకుంది" అని ఆయన వెల్లడించారు.

గడచిన సంవత్సరంలో రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) రూ. 8.75 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు 'అవసర ఆమోదం (యాక్సెప్టెన్స్ ఆఫ్ నెస్సెసిటీ)' మంజూరు చేసిందని.. ఇది రక్షణ ఆధునికీకరణపై ప్రభుత్వ ప్రాధాన్యతను తెలియజేస్తోందని తెలిపారు. ఈ ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి రక్షణ కొనుగోళ్లలో చేపట్టిన ప్రాథమిక సంస్కరణలను ఆయన వివరించారు. ఇందులో భాగంగా కార్యాచరణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఫీల్డ్ కమాండర్ల ఆర్థిక పరిమితిని రెండు రెట్లు పెంచడం, స్వదేశీకరణను ప్రోత్సహించడానికి రెవెన్యూ మార్గం ద్వారా రూ. 1.25 లక్షల కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు.'ఆత్మనిర్భరత' దిశగా సాగుతున్న ప్రయాణంలో రక్షణ దళాల క్రియాశీల భాగస్వామ్యాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. స్వదేశీ యుద్ధనౌకలు, విమానాలు, అధునాతన సైనిక వ్యవస్థలు రక్షణ దళాల సామర్థ్యాలను బలోపేతం చేస్తున్న తరుణంలో భారతదేశపు రక్షణ స్వావలంబన ఊపందుకుంటోందని ఆయన ఉద్ఘాటించారు.

మారుతున్న రక్షణ రంగ పరిణామాల మధ్య భవిష్యత్ యుద్ధ తంత్రాలకు అవసరమైన సాంకేతికతలలో డీఆర్‌డీఓ, రక్షణ దళాలు భారత్‌ను అగ్రగామిగా నిలబెడుతున్నాయని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. సంప్రదాయ ఆయుధాలను కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించే ఆయుధాలుగా మార్చగల సామర్థ్యం ఉన్న మొట్టమొదటి 'టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజ్ ఆగ్మెంటేషన్' వ్యవస్థను విజయవంతంగా పరీక్షించటాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఎంఐఆర్‌వీ సాంకేతికతతో కూడిన అధునాతన అగ్ని క్షిపణి పరీక్ష మన వ్యూహాత్మక నిరోధక సామర్థ్యాలకు కొత్త కోణాన్ని ఇచ్చింది. దీర్ఘ శ్రేణి ఉపరితల దాడి క్రూయిజ్ క్షిపణి, గగనతలం నుంచి భూతలంపైకి దాడి చేయగల రుద్రమ్-ఎఎ క్షిపణి, నౌకదల యాంటీ-షిప్ క్షిపణి అయిన ఎస్ఆర్, పినాక దీర్ఘ శ్రేణి గైడెడ్ రాకెట్ వంటి వాటి విజయవంతమైన ప్రయోగాలు భారతదేశపు దాడి సామర్థ్యాలను అపూర్వంగా పెంచాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.

'యాక్టివ్ కూల్డ్ ఫుల్-స్కేల్ స్క్రామ్‌జెట్ కంబస్టర్'ను 1,200 సెకన్లకు పైగా విజయవంతంగా పరీక్షించడం గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ ఘనత హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతికతను అభివృద్ధి చేయగల దేశాల సరసన భారత్‌ను నిలబెట్టిందని పేర్కొన్నారు. స్వదేశీ దీర్ఘశ్రేణి భూతలం నుంచి గగనతలంలోకి దాడి చేయగల క్షిపణి అయిన 'కుశ'ను తొలిసారిగా విజయవంతంగా పరీక్షించడంతో దేశ వాయు రక్షణ సామర్థ్యాలు మరింత పటిష్ఠమయ్యాయని ఆయన అన్నారు.

రక్షణ సన్నద్ధత, సరిహద్దు ప్రాంతాలతో అనుసంధానాన్ని మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించినట్లు రక్షణ మంత్రి చెప్పారు. దేశంలో లేదా విదేశాలలో ఏదైనా దురదృష్టకరమైన ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు సహాయక, పునరావాస కార్యక్రమాలను చేపట్టడంలో ఎల్లప్పుడూ 'మొదట స్పందించేవారిగా' వ్యవహరిస్తున్న రక్షణ దళాలను ఆయన ప్రశంసించారు.

సేవలో ఉన్న, రిటైర్ అయిన రక్షణ సిబ్బందితో పాటు వారి కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. వారిని గౌరవం, ప్రతిష్ఠ, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా ఆయన అభివర్ణించారు. "గత ఐదేళ్లలో ఈసీహెచ్ఎస్ (ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్) బడ్జెట్ 300 శాతం పెరిగింది. సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి కింద పేదరిక నిర్మూలన ఆర్థిక సహాయం (పెన్యూరీ గ్రాంట్ ) రూ. 4,000 నుంచి రూ. 8,000కి, విద్యా గ్రాంటు రూ. 1,000 నుంచి రూ. 2,000కి.. వివాహ గ్రాంటు రూ. 50,000 నుంచి రూ. 1,00,000కి రెట్టింపు అయ్యాయి. ఈ నిర్ణయాలు మన సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమంపై మన నిబద్ధతను తెలియజేస్తున్నాయి" అని ఆయన అన్నారు.

రక్షణ దళాల్లో మహిళలకు మరింత ఎక్కువ అవకాశాలు కల్పించడంపై.. జాతీయ భద్రత, దేశ నిర్మాణంలో 'నారీ శక్తి'ని సమర్థవంతంగా ఉపయోగించుకోవటంపై ప్రభుత్వం ఎల్లప్పుడూ దృష్టి సారిస్తోందని రక్షణ మంత్రి చెప్పారు. "జాతీయ డిఫెన్స్ అకాడమీలో (ఎన్డీఏ) శిక్షణ పొందిన మొదటి మహిళా కేడెట్ల బ్యాచ్ త్రివిధ దళాలలో అధికారులుగా బాధ్యతలు స్వీకరించినప్పుడు మనం ఒక చారిత్రాత్మక ఘనతను సాధించాం. ధైర్యం, నాయకత్వం ఏ ఒక్క లింగానికి పరిమితం కావు అనడానికి ఇదే నిదర్శనం. ఇండియన్ ఆర్మీ సెయిలింగ్ వెసెల్ అయిన 'త్రివేణి'పై త్రివిధ దళాలకు చెందిన మహిళలు మాత్రమే ఉండే బృందం చేపట్టిన ప్రపంచాన్ని చుట్టివచ్చే నౌకాయాన యాత్ర 'సముద్ర ప్రదక్షిణ'.. 'నారీ శక్తి'తో శక్తిమంతమైన నవ భారతదేశానికి ప్రతీకగా నిలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

79 సంవత్సరాల క్రితం మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సరోజినీ నాయుడు, రాణి గైడెన్లతో పాటు గుర్తించిన, గుర్తించని ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు స్వతంత్ర భారత్‌కు పునాది వేశారని.. నేడు దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించే బాధ్యత రక్షణ దళాలపై ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. "అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ మన సైనికుల అచంచలమైన సంకల్పం.. ప్రజలు సురక్షితమైన వాతావరణంలో తమ కలలను సాకారం చేసుకునేలా భరోసా ఇస్తుంది. వారి ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. వారి అసమాన సేవలకూ, త్యాగానికీ, అంకితభావానికీ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రతి సైనికుడికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మన జాతీయ గేయం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం కూడా 2026 సంవత్సరంలోనే రావటంతో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక విశిష్టత ఉందని రక్షణ మంత్రి అన్నారు.

"ఈ సందర్భాన్ని ఎంతో ఉత్సాహంతో జరుపుకోవడం మన అందరి సామూహిక బాధ్యత.

ఇది కేవలం ఒక వార్షికోత్సవం మాత్రమే కాదు.. మన సమష్టి స్పృహకు వేడుక.

ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి పౌరుడిలో దేశభక్తిని, దేశసేవా భావాన్ని మరింత ఇనుమడింపజేస్తుందనే నమ్మకం నాకుంది.

మనమందరం దేశ నిర్మాణంలో క్రియాశీలక భాగస్వాములుగా మారాలని, మన విధులను అంకితభావంతో నిర్వర్తించడం ద్వారా 'వికసిత్ భారత్' నిర్మాణానికి అర్థవంతమైన తోడ్పాటును అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం" అని అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## జనవరి నుంచి మే మధ్య కాలంలో 19 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మరణించినట్లు వచ్చిన వార్తలపై సుమోటోగా విచారణకు స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ

న్యూఢిల్లీ, ఆగష్టు 15:జనవరి నుంచి మే 22, 2026 మధ్య అయిదు నెలల కన్నా తక్కువ వ్యవధిలోనే 19 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) సిబ్బంది ఆత్మహత్య చేసుకుని మరణించినట్లు వచ్చిన మీడియా కథనాన్ని భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. సీఆర్‌పీఎఫ్ గణాంకాల ప్రకారం... 2025లో ఆత్మహత్యల కారణంగా 59 మంది సిబ్బందిని ఈ దళం కోల్పోయింది. నివేదికల ప్రకారం... గత అయిదేళ్లలో నమోదైన ఆత్మహత్యల్లో ఇదే అత్యధికం.

కమిషన్ పరిశీలన ప్రకారం... ఆ వార్తా కథనంలోని అంశాలు నిజమైతే, దేశంలోని అతిపెద్ద కేంద్ర సాయుధ పోలీసు దళంలో పనిచేస్తున్న సిబ్బంది జీవించే హక్కు ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు కమిషన్ భావించింది. ఈ అంశంపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది.మీడియా నివేదిక ప్రకారం.. ఆగస్టు 11, 2026 నాటికి గడిచిన అయిదేళ్లలో మొత్తం 281 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆత్మహత్య చేసుకుని మరణించారు. వీరిలో దాదాపు 216 మంది విధుల్లో ఉన్నవారు. సీఆర్‌పీఎఫ్ విభాగంలో 2021లో 57, 2022లో 43, 2023లో 57, 2025లో 59 ఆత్మహత్యలు నమోదయ్యాయి.

# నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



కరీంనగర్, ఆగష్టు 15: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు తెలియజేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 2023లో అధికారం చేపట్టిన నాటి నుండి ప్రజా ప్రభుత్వం నిరుపేదల అభివృద్ధి కోసం పనిచేస్తున్నదన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనా అన్నారు. పెద్దపల్లి జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిసిపి రామ్ రెడ్డి తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే స్వేచ్ఛ



నల్గొండ, ఆగష్టు 15:నాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి జనగణమన ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్క రూ పేదలకు అండగా నిలిచి, వారి కన్నీళ్లు తుడిచి, ముఖాల్లో సంతోషం చూడగలిగినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందినట్లవుతుందని అన్నారు.

# చాక్లెట్ ఆశ చూపి అమానుషం

## -తల్లి ఫిర్యాదుతో కలకలం

ఆదిలాబాద్, ఆగష్టు 15: మంథని మండలంలోని ఓ గ్రామంలో పసికూనపై అమానుషమైన సంఘటన జరిగింది. రెండో తరగతి చదువుతున్న 6 సంవత్సరాల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి తల్లి శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు వివరాల ప్రకారం, బాధితురాలి తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 12న సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలికను ఇంటి సమీపంలో నివసించే బూడిద రాకేష్ చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తానని ఆశ చూపి తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెకు చాక్లెట్ ఇచ్చి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక తన తల్లికి చెప్పింది. అదే రోజు సాయంత్రం స్నానం చేయిస్తుండగా బాలిక నొప్పిగా ఉందని తెలపడంతో తల్లిదండ్రులు అనుమానించారు. మరుసటి రోజు గురువారం రోజున మంథని, గోదావరిఖని ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించారు.

# నిరుపేదలకు సంక్షేమ ఫలాలు



కరీంనగర్, ఆగష్టు 15: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలియజేసారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కళాశాలలో సైతం మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగస్టు నెల ఆన్‌లైన్ స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ముగింపు

న్యూఢిల్లీ, ఆగష్టు 15:జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు వారాల ఆన్‌లైన్ స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం (ఓఎస్‌టీఐ) నేడు ముగిసింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి దరఖాస్తు చేసుకున్న 2,036 మందిలో ఎంపికైన 96 మంది విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమం 2026 ఆగస్టు 3న ప్రారంభమైంది.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు శ్రీమతి విజయ భారతి సయాని ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. భారతీయ సామాజిక, సాంస్కృతిక జీవన విధానంలో అంతర్భాగమైన సేవ ప్రాధాన్యాన్ని ఆమె వివరించారు. సేవ అంటే కేవలం దాతృత్వం కాదని, సమాజ సమష్టి శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేయడమని ఆమె పేర్కొన్నారు. మానవ హక్కులు అంటే ప్రజలకు సంబంధించినవేనన్న విషయాన్ని ఇంటర్న్‌లు గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఫైలు వెనుక, ప్రతి మానవ హక్కుల ఉల్లంఘన ఘటన వెనుక వినాల్సిన, అర్థం చేసుకోవాల్సిన మానవీయ గాథలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఇంటర్న్‌లకు పిలుపునిస్తూ, ఏ వృత్తిలో ఉన్నప్పటికీ తమ విజ్ఞానం, నైపుణ్యాలను సమాజం సమష్టి శ్రేయస్సు కోసమే వినియోగించాలని ఆమె సూచించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను పాటించడం ప్రతి తరానికి ఉన్న బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. భగవద్గీతను, స్వామి వివేకానంద, డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం బోధనలను ప్రస్తావిస్తూ, ఇంటర్న్‌లు తమ విజ్ఞానాన్ని ఇతరులకు విద్యను అందించేందుకు, వారికి అవకాశాలను కల్పించేందుకు వినియోగించాలని ఆమె పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి, మెరుగైన మౌలిక వసతులు మాత్రమే కాదని, మానవ గౌరవం, న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధిని పరిరక్షించడం కూడా అభివృద్ధిలో భాగమేనని ఆమె పేర్కొన్నారు.

అంతకుముందు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాయింట్ సెక్రటరీ శ్రీమతి సైదింగ్‌పుయి ఛక్చువాక్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహణపై సమగ్ర వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్‌లకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు, సీనియర్ అధికారులు, ప్రముఖ నిపుణులు, విద్యావేత్తలు, కోర్ గ్రూప్ సభ్యులు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులతో సంభాషించే అవకాశం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ఇంటర్న్‌లకు మానవ హక్కులపై అవగాహనను మరింత పెంపొందించిందని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు. పుస్తక సమీక్ష, గ్రూప్ పరిశోధనా ప్రాజెక్ట్ ప్రజెంటేషన్, ఉపన్యాసం తదితర పోటీల విజేతలను కూడా ఆమె ప్రకటించారు. ఎన్‌హెహెచ్‌ఆర్‌సీ జాయింట్ సెక్రటరీ శ్రీ సమీర్ కుమార్, డిప్యూటీ సెక్రటరీ శ్రీమతి వినీతా ఒట్టపురక్కల్ కల్లాడతో పాటు పలువురు సీనియర్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వం కోసం పోరాటం: కాంగ్రెస్ నేతలు




ఖమ్మం, ఆగష్టు 15:ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ సభలో ప్రసంగించిన అనంతరం వేదికను 'శుద్ధీకరణ' పేరుతో ప్రక్షాళన చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘటనకు వ్యతిరేకంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ బలహీన వర్గాలు, దళిత నాయకుల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరి ఆందోళనకరంగా ఉందని విమర్శించారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడి పట్ల వేదిక శుద్ధీకరణ పేరుతో వ్యవహరించడం అవమానకరమని, ఇది సామాజిక వివక్షను ప్రతిబింబిస్తోందని ఆరోపించారు.

ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు స్పందించాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెదబాబు, పూణెం శ్రీనివాస్, సర్పంచులు అజ్మీరా లైలా, బానోత్ రాణి, కొంపెల్లి వీరయ్య, దయ్యాల సమ్మయ్య, బండ వెంకటేశ్వర్లు, పాయం లక్ష్మీనర్సు, వర్స నరసింహారావు, చింత రమేష్, బరపటి శ్రీనివాసరావు, తాండ్ర కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నల్గొండ, ఆగష్టు 15: పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దండ గ్రామానికి చెందిన గోదాటి సైదులు (45), తండ్రి వెంకన్న కౌలుకు తీసుకున్న పొలంలో పచ్చిగడ్డి కోసేందుకు వెళ్లాడు. గడ్డి కోస్తున్న సమయంలో విద్యుత్ మోటార్‌కు సంబంధించిన వైరు కొడవలికి తగిలి తెగిపోవడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవాహం ఏర్పడింది.

దీంతో సైదులుకు తీవ్ర విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

మృతుడి భార్య రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. సైదులు కౌలు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సైదులు ఆకస్మికంగా మృతి చెందడంతో భార్య, కుమార్తెలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల రోదనలు గ్రామంలో విషాదాన్ని నింపాయి.

# కఠిన విధానంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తున్న మోదీ ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 15:అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో భాగంగా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) కీలక ముందడుగు వేసింది. ఢిల్లీలోని సరోజినీ నగర్, పిల్లంజి ప్రాంతానికి చెందిన... వీరేందర్ సింగ్ బసోయా (అలియాస్ వీరూ, అలియాస్ బసోయా)ను భారత్‌కు రప్పించడంలో ఈ సంస్థ విజయం సాధించింది. వీరూ.. మాదకద్రవ్యాల కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ఈ రోజు తెల్లవారుజామున ఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయానికి చేరుకోగానే సంబంధిత అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఎన్‌సీబీ అభ్యర్థన మేరకు జారీ చేసిన ఇంటర్‌పోల్ 'రెడ్ నోటీసు' ఆధారంగా, జూన్ 2026లో బసోయాను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో అరెస్టు చేశారు. యూఏఈ అధికారులతో భారతీయ ఏజెన్సీల నిరంతర సమన్వయం ద్వారా అతన్ని తిరిగి భారత్ తీసుకురావడం సాధ్యమైంది.

'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్టులో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు... "మోదీ ప్రభుత్వం విదేశాల్లో దాక్కున్న మాదకద్రవ్యాల స్మగ్లర్లను వెతికి పట్టుకుంటూ, వారి వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తోంది. మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించే విధానంలో ముందడుగు వేస్తూ, పరారీలో ఉన్న డ్రగ్ కింగ్‌పిన్ వీరేందర్ సింగ్ బసోయాను యూఏఈ నుంచి తిరిగి భారత్‌కు రప్పించడంలో ఎన్‌సీబీ విజయం సాధించింది. ఈ నేరస్థుని గురించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, అదుపులోకి తీసుకోవడం ద్వారా... మాదకద్రవ్యాల స్మగ్లర్లు ఎక్కడ దాక్కున్నా, భారత చట్టం బారి నుంచి వాళ్లుతప్పించుకోలేరని మన ఏజెన్సీలు మరోసారి నిరూపించాయి."

2024 ఫిబ్రవరి నెలలో పూణే నగర పోలీసులు 500 గ్రాముల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఈ కేసు పూణేలో ప్రారంభమైంది. ఆ తర్వాత, సమగ్ర దర్యాప్తు పద్ధతిని అనుసరించి మొత్తం మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను గుర్తించి, నిర్మూలించడం లక్ష్యంగా దర్యాప్తును విస్తరించారు. తదుపరి దర్యాప్తు, అనుసరణ చర్యల ఫలితంగా పూణేలో సుమారు 867 కిలోల మెఫెడ్రోన్, ఢిల్లీలో 970 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో స్వాధీనం చేసుకున్న మొత్తం మెఫెడ్రోన్ పరిమాణం సుమారు 1,837 కిలోలకు చేరింది. తదుపరి దర్యాప్తు కోసం ఈ కేసును ఎన్‌సీబీ ముంబయి జోనల్ యూనిట్‌కు బదిలీ చేశారు.

విచారణలో బసోయాను కీలక విదేశీ ఆపరేటివ్‌గా, కుట్రదారుడిగా గుర్తించారు. విదేశాల నుంచి సిండికేట్ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ, భారత్ నుంచి ఇతర దేశాలకు మెఫెడ్రోన్ సరుకు ఎగుమతిని బసోయా సులభతరం చేశాడు. ఢిల్లీలో స్వాధీనం చేసుకున్న సుమారు 970 కిలోల మెఫెడ్రోన్, అతనితో సంబంధం ఉన్న కొరియర్ మార్గాల ద్వారా ఎగుమతి చేయడానికి సంబంధించినదనే ఆరోపణలు ఉన్నాయి. దేశీయ అక్రమ తయారీ, అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను దాని విదేశీ పంపిణీ మార్గాలతో అనుసంధానించడంలో బసోయా కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆధారాలు లభించాయి.

అంతర్జాతీయ కొకైన్ అక్రమ రవాణాకు సంబంధించి ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ వద్ద గల మరో కేసులోనూ బసోయా పేరు ఉంది. అక్టోబర్ 2024లో, ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ ఒక ప్రధాన మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాను ఛేదించింది. దీని ఫలితంగా ఢిల్లీ, హాపూర్, ఘజియాబాద్‌లోని పలు గోదాములు, ఇతర ప్రాంగణాలతో పాటు గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో ఉన్న ఒక ఫ్యాక్టరీ నుంచి పలుమార్లు మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమన్వయ కార్యకలాపాల ఫలితంగా 1,300 కిలోగ్రాములకు పైగా కొకైన్, మెఫెడ్రోన్, హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై చేసిన దర్యాప్తులో... ఈ కొకైన్, ఇతర మాదకద్రవ్యాల సేకరణ, రవాణా, నిల్వ, పంపిణీని సమన్వయం చేయడంలో బసోయా పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయి.

విదేశీ అధికార పరిధుల్లో పనిచేస్తున్న ప్రధాన మాదకద్రవ్యాల స్మగ్లర్లు, పరారీలో ఉన్న నిందితులను గుర్తించడం, వారి ఆచూకీ కనుగొని, అదుపులోకి తీసుకోవడం కోసం ప్రారంభించిన 'ఆపరేషన్ గ్లోబల్-హంట్' కింద... ఎన్‌సీబీ నిరంతర కృషితో బసోయాను భారత్‌కు రప్పించగలిగింది. ఈ కార్యక్రమంలో ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు సహా అంతర్జాతీయ సహకార యంత్రాంగాలనూ ఉపయోగించుకున్నారు. చట్టాలను అమలు చేసే జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కార్యాచరణ సమన్వయాన్నీ ఇది బలపరిచింది. ఇంతకుముందు టర్కీ నుంచి మహమ్మద్ నలీం డోలా, మలేషియా నుంచి నవీన్ చిచ్కర్ వంటి ఇతర వాంటెడ్ డ్రగ్ స్మగ్లర్లను విజయవంతంగా భారత్‌కు రప్పించడం ఈ కార్యక్రమం కింద సాధించిన ముఖ్యమైన విజయాలే.

గౌరవ కేంద్ర హోంమంత్రి ఆవిష్కరించిన మాదక ద్రవ్యాల నియంత్రణ సంబంధిత విజన్ డాక్యుమెంట్ (2026?2029)కు అనుగుణంగా... పరారీలో ఉన్న నేరస్థులు వారి నేరాలకు తగిన చట్టపరమైన పరిణామాలు ఎదుర్కొనేలా వారిని తిరిగి భారత్‌కు తీసుకువస్తున్నారు. ఈ రోడ్‌మ్యాప్‌లో భాగంగా, ఇతర జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీలతో సమన్వయ చర్యల ద్వారా... విదేశాల నుంచి పనిచేస్తున్న ఇతర ముఖ్యమైన మాదకద్రవ్యాల కేసులకు సంబంధించి పరారీలో ఉన్న నేరస్థులను గుర్తించి, వారి ఆచూకీ కనుగొని, వారిని తిరిగి భారత్‌కు తీసుకురావడానికి నిరంతర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శనంలో... మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ విధానం పట్ల ఎన్‌సీబీ దృఢమైన నిబద్ధతతో ఉంది. భారత్‌లో గానీ, విదేశాల్లో గానీ పనిచేస్తున్న డ్రగ్ ముఠాలు, డబ్బు సమకూరుస్తున్నవాళ్లూ, మధ్య వర్తులు, పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం ఎన్‌సీబీ తన ప్రయత్నాలను కొనసాగిస్తోంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి జాతీయ, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేస్తోంది.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు... రైల్వే మంత్రి నేతృత్వంలో రైల్ భవన్ వేదికగా 'తిరంగా ర్యాలీ'

న్యూఢిల్లీ, ఆగష్టు 15: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు, 'రైల్ భవన్' ప్రాంగణంలో నిర్వహించిన 'తిరంగా ర్యాలీ'కి కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ నేతృత్వం వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో... రైల్వే బోర్డు చైర్మన్, సీఈవో శ్రీ సతీష్ కుమార్, బోర్డు సభ్యులు, డైరెక్టర్ జనరల్స్ (డీజీలు), ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్న భారతీయ రైల్వే... దేశభక్తి, దేశ గౌరవం, ఐక్యతా స్ఫూర్తిని సంస్థ వ్యాప్తంగా చాటుతోంది. 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న వేడుకల్లోని మూడో దశతో అనుసంధానిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా, ఈ విశిష్ట జాతీయ గీతం చారిత్రక, సాంస్కృతిక, జాతీయ ప్రాముఖ్యతను తెలియజేసేలా రైల్ భవన్‌లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ వేడుకల్లో భాగంగా, ఈ నెల 10న రైల్ భవన్‌లో 'వందేమాతరం 150 ఏళ్ల ప్రస్థానం' అనే అంశంపై క్విజ్ పోటీనీ నిర్వహించారు. ఈ జాతీయ గీతపు గొప్ప చరిత్ర, చిరస్థాయిగా నిలిచిపోయే వారసత్వాన్ని తెలుసుకునే అవకాశాన్ని ఈ కార్యక్రమం అధికారులకు కల్పించింది.

'దేశభక్తి గీతాలు' అంశంపై ఈ నెల 11న రైల్ భవన్‌లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా సాగిన సంగీత ప్రదర్శనలు దేశభక్తి స్ఫూర్తిని చాటాయి.

ఈ రోజు జరిగిన వేడుకల్లో భాగంగా, రైల్ భవన్‌లో 'వందేమాతరం' సామూహిక గానం నిర్వహించారు.

భారతీయ రైల్వే ఈ కార్యక్రమాల ద్వారా తన అధికారులు, ఉద్యోగుల్లో దేశభక్తి, జాతీయ గౌరవం, ఐక్యతల స్ఫూర్తిని పటిష్ఠం చేస్తూ... 'వందేమాతరం' గీతం చారిత్రక వారసత్వాన్ని గుర్తుచేస్తోంది. 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న వేడుకలు... దేశ వారసత్వాన్ని, ఆధునిక, ప్రగతిశీల భారత్ కోసం తన ఆకాంక్షలను చాటడంలో భారతీయ రైల్వేల సమష్టి బ. ా గ్ స్వా వ వ్య ని ప్రతిబింబిస్తున్నాయి.

## టెలివిజన్ ఛానళ్ల విషయంలో 12 నిమిషాల ప్రకటనల కాలపరిమితిని తొలగించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 15:టెలివిజన్ ఛానళ్ల విషయంలో ఉన్న 12 నిమిషాల ప్రకటనల కాలపరిమితిని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నిబంధనలు-1994 కింద టెలివిజన్ ప్రసారాలపై ప్రకటనల కాలపరిమితిని 2006 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి టీవీ ప్రసార రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. 2006లో కేవలం 62 టీవీ ఛానళ్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 900కి పైగా చేరింది.

ఆ సమయంలో టీవీ ఛానళ్లను ప్రసారం చేసే ప్రధాన మాధ్యమం అయిన కేబుల్ టీవీ అనలాగ్ విధానంలో ఉండేది. దీనికి పరిమితమైన క్యారేజ్ సామర్థ్యం ఉండటం వల్ల వినియోగదారులకు చాలా తక్కువ ఎంపికలు మాత్రమే లభించేవి. కేబుల్ టీవీ రంగం పూర్తిగా డిజిటలీకరణ చెందిన తర్వాత ప్రస్తుతం డీటీహెచ్, కేబుల్ టీవీ, హెచ్ఐటీఎస్, ఐపీటీవీ వంటి అన్ని టీవీ ఛానళ్లను పంపిణీ చేసే మాధ్యమాలు డిజిటల్ రూపంలోకి మారాయి. ఇవి ప్రస్తుతం 300 నుంచి 500 లేదా అంతకంటే ఎక్కువ ఛానళ్లను ప్రసారం చేస్తూ వినియోగదారులకు ఉన్న వివిధ అవసరాలను తీరుస్తూ ఎక్కువ వైవిధ్యాన్ని అందిస్తున్నాయి. ఫలితంగా మార్కెట్ గతిశీలతలో ఇప్పుడు తగినంత పోటీ ఏర్పడింది.

టీవీ ప్రసార రంగంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రకటనల కాలపరిమితికి సంబంధించిన నిబంధనలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. భారత్‌లో ఒక ఛానల్ 'పెయిడ్' లేదా 'ఫ్రీ-టు-ఎయిర్' ఏదైనా సరే.. ఈ రంగం ప్రధానంగా ప్రకటనలపైనే ఆధారపడి ఉంది. ఎటువంటి ప్రకటనల నిబంధనలు లేని డిజిటల్ మీడియాతో పోలిస్తే సంప్రదాయ టీవీ ఛానళ్లకు సమానమైన పోటీ వాతావరణం లేకుండా పోయింది.

టీవీ పరిశ్రమలో అంతర్గతంగా.. అలాగే టీవీ పరిశ్రమకు, డిజిటల్ మీడియాకు మధ్య మార్కెట్‌లో తగినంత పోటీ ఉందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ భావిస్తోంది. సమర్థ పోటీని ప్రోత్సహించడానికి, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి ప్రకటనల కాలపరిమితిని ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నిబంధనలు-1994 సవరణకు సంబంధించి గెజిట్‌లో నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఈ నిర్ణయం అమలోకి వస్తుంది.

## అంతంపల్లిలో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం



నిజామాబాద్, ఆగష్టు 15:మండలంలోని అంతంపల్లి గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సహకార సంఘం వద్ద సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వలకొండ రాణి మంజుల జాతీయ జెండాలను ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కనుల పండువగా కొనసాగాయి.

## ప్రపంచ సెయిలింగ్ పోటీల్లో పతకం సాధించిన రిశ్వితకు ఘన సన్మానం



కామారెడ్డి, ఆగష్టు 15 నేటినిజం (ప్రతినిధి) ప్రపంచ సెయిలింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన బిక్కనూర్ మండల కేంద్రానికి చెందిన రిశ్వితను యూత్ క్లబ్ సభ్యులు ఘనంగా అభినందించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం రిశ్వితను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా యూత్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన రిశ్విత ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొని పతకం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రిశ్వితకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ప్రతినిధులు లింబాద్రి, మహిపాల్ రెడ్డి, వెంకట సుబ్బారావు, ఆర్టీసీ లక్ష్మీనారాయణ గౌడ్, జనార్దన్ రెడ్డి, మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, భూమయ్య, భరత్ కుమార్, రాజేందర్, దయాకర్ రెడ్డి, సాయిలు, రామచంద్రం, గ్రామ సచివాలయ వార్డు సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'సైనికుడు', 'ఛాంపియన్' అయిన ఈ క్రీడాకారులు ఎంతో స్ఫూర్తిదాయకం: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 15:స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఇటీవల ముగిసిన కామన్వెల్త్ క్రీడల్లో 16 పతకాలు - 08 స్వర్ణాలు, 07 రజత పతకాలు, 01 కాంస్య పతకం సాధించిన భారత సైనిక దళ సభ్యులతో ఆగస్టు 14, 2026న రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సమావేశమయ్యారు. ఈ క్రీడల్లో భారత్ 39 పతకాలు- 13 స్వర్ణం, 17 రజతం, 09 కాంస్య పతకాలు సాధించగా? అందులో భారత రక్షణ శాఖ సిబ్బంది 18 పతకాలను (16- భారత ఆర్మీ, 02- భారత నేవీ) గెలుచుకున్నారు.

అంతర్జాతీయ క్రీడా కార్యక్రమంలో శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి దేశానికి గర్వకారణంగా నిలిచిన భారత రక్షణ దళాల దృఢమైన సంకల్ప శక్తిని, బలమైన విశ్వాసాన్ని రక్షణమంత్రి ప్రశంసించారు. ఈ విజయాన్ని "అసాధారణం" అని అభివర్ణిస్తూ.. "సైనికుడు, ఛాంపియన్ల" అద్భుత కలయిక ఈ క్రీడాకారులు అని అన్నారు. వీరు ప్రజలకు, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

భారతదేశంలో పెరుగుతున్న నారీ శక్తికి నిదర్శనంగా బాక్సింగ్‌లో 06 స్వర్ణ పతకాలకుగాను, మహిళా బాక్సర్లు 04 స్వర్ణ పతకాలను సాధించారని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ విజయం మరింత మంది బాలికలు క్రీడా రంగంలోకి వచ్చేందుకు, రక్షణ రంగంలో చేరేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా ప్రతీ ప్రాంతం నుంచి ఛాంపియన్లు పుట్టుకొస్తున్నారని రక్షణ మంత్రి అన్నారు. ఇవాళ క్రీడా రంగం అందరికీ అందుబాటులో ఉందని, ఇకపై కొద్దిమందికి మాత్రమే చెందిన ప్రత్యేకమైన హక్కు కాదని స్పష్టం చేశారు. ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ వంటి రాబోయే క్రీడా కార్యక్రమాల కోసం అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సైనికదళాల ప్రధానాధికారి జనరల్ ధీరజ్ సేత్, ఇతర సీనియర్ సైనికాధికారులు పాల్గొన్నారు. 2026 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత సైనిక బృందం అనేక ప్రథమాలను, రికార్డులను నమోదు చేసింది. అవి:

కామన్వెల్త్ గేమ్స్‌లో పారా షాట్‌పుట్‌లో భారతదేశానికి తొలి స్వర్ణ, రజత పతకాలను సాధించి సుబేదార్ సోమన్ రాణా, లాన్స్ నాయక్ శుభం జుయల్ చరిత్ర సృష్టించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో 79 కేజీల విభాగంలో హవాల్దార్ అజయ్ బాబు రికార్డు సృష్టించారు. స్నాచ్‌లో 149 కేజీలతో రికార్డు సృష్టించటంతో పాటు మొత్తం 330 కేజీల బరువును ఎత్తి అద్భుతమైన ప్రదర్శనను నమోదు చేశారు.

బాక్సింగ్‌లో 100 ఏళ్ల నాటి ఇంగ్లీష్ రికార్డును బద్దలు కొట్టి అపూర్వమైన జాతీయ ఘనతను సాధించటంలో భారత సైన్యం చరిత్రాత్మక పాత్రను పోషించింది. ఈ క్రీడల ఒకే ఎడిషన్‌లో బాక్సింగ్‌లో ఏ దేశమూ గెలుచుకోనన్ని అత్యధికంగా ఏడు స్వర్ణ పతకాలను భారత్ గెలుచుకుంది.

ఈ 7 స్వర్ణ, 3 రజత పతకాల్లో భారత సైన్యానికి చెందిన బాక్సర్లు 6 స్వర్ణాలు, 2 రజతాలను కైవసం చేసుకున్నారు.

హైజంప్‌లో నాయిబ్ సుబేదార్ సర్వేశ్ కుషారే భారత్‌కు కామన్వెల్త్ గేమ్స్‌లో తొలి రజత పతకాన్ని సాధించి, భారత అథ్లెటిక్స్‌లో కీలక విజయాన్ని అందుకున్నారు.

## పోర్చుగల్‌లోని పొంటా డెల్గాడాలోకి ప్రవేశించిన లోకయాన్-2026 భారత నౌకాదళ నౌక సుదర్శిని

న్యూఢిల్లీ, ఆగష్టు 15:లోకా యన్-2026 యాత్రలో భాగంగా భారత నౌకాదళానికి చెందిన శిక్షణ నౌక ఐఎన్ఎస్ సుదర్శిని ఆగస్టు 13, 2026న పోర్చుగల్‌లోని అజోర్స్‌లో పొంటా డెల్గాడా ఓడరేవుకు చేరుకుంది. అమెరికాలోని బోస్టన్ నుంచి బయలుదేరి అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటుకుంటూ సాగిన 19 రోజుల సుదీర్ఘ సముద్ర ప్రయాణం విజయవంతంగా ముగిసింది. ఐఎన్ఎస్ సుదర్శిని అట్లాంటిక్ సముద్రాన్ని దాటటం ఇది రెండోసారి. నౌకాదళ సిబ్బంది సహనం, పట్టుదల, నావికా నైపుణ్యాలను ఈ యాత్ర చాటిచెబుతుంది.

పోర్చుగీసు నావికాదళం నుంచి ఈ నౌకకు ఘన స్వాగతం లభించింది. భారతదేశ సుసంపన్న సముద్రయాన వారసత్వాన్ని, మైత్రిని, సముద్ర సహకార సందేశాన్ని ఈ పోర్టు సందర్శన తెలియజేస్తుంది. ఈ సందర్శన సందర్భంగా అజోర్స్ మారిటైమ్ జోన్ కమాండర్ (సీఓఎం సీజడ్ఎంఏ) కొమోడోరో లూయిస్ నికల్సన్ లావ్రాడోర్‌ను ఐఎన్ఎస్ సుదర్శిని కమాండింగ్ ఆఫీసర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వృత్తిపరమైన చర్చలు, నిర్వహణపరమైన సరఫరా, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల్లో ఈ నౌక పాల్గొంటుంది. ఇది భారత్, పోర్చుగల్ మధ్య సముద్రయాన బంధాలను మరింత బలపరుస్తుంది.

15,000 నాటికల్ మైళ్లకుపైగా ప్రయాణించిన ఐఎన్ఎస్ సుదర్శిని.. సత్సంబంధాలకు ప్రతీకగా, భారతదేశ సముద్రయాన చరిత్ర వైభవాన్ని చాటిచెప్పే రాయబారిగా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

## త్యాగధనుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### -దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
### -ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ



మహబూబ్‌నగర్, ఆగష్టు 15:అచ్చంపేట పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నివాళులర్పించారు. అనంతరం పలు ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాతుకుల శ్రీశైలం, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో మూడుసార్లు వందేమాతరం

మహబూబ్‌నగర్, ఆగష్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని మూడుసార్లు ఆలపించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో గేయాలాపనకు సంబంధించి సాధారణంగా పాటించే క్రమానికి భిన్నంగా కార్యక్రమం సాగిందంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా విద్యార్థులతో వందేమాతరం గేయాన్ని ఆలపింపజేశారు. అనంతరం జయ జయ తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఆ తర్వాత మరోసారి వందేమాతరం గీతాన్ని పాడించారు. చివరగా మూడోసారి పూర్తిస్థాయి వందేమాతరం గీతాన్ని మైక్ ద్వారా ఆలపించారు. ఈ సమయంలో పలుమార్లు మైక్ మొరాయించడంతో కొంత ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అనంతరం తహసీల్దార్ సతీష్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఒకే కార్యక్రమంలో మూడుసార్లు వందేమాతరం గీతాన్ని ఆలపించడంపై పలువురు చర్చించుకున్నారు. కార్యక్రమ నిర్వహణ తీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# మహిళ దారుణహత్య



అమరావతి, ఆగస్టు 15:ఆకివీడు మండలం ఉప్పుటేరు నుండి మందపాడు వెళ్లే రహదారిలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. గాయాలతో ఉప్పుటేరు నుండి మందపాడు వెళ్లే రహదారి ఉదయం ఒక మహిళ మృతదేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

గాయాలు ఉండడంతో హత్య జరిగినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటన స్థలానికి క్లూస్ టీమ్స్ చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మహిళకు సుమారు 38 సంవత్సరాలు ఉండొచ్చని, ఆ మహిళ ఎవరనే విషయం తదుపరి దర్యాప్తులో తేలనున్నట్లుగా పోలీసులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ రఘువరన్ విష్ణ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. మరిన్ని వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని సిఐ కాళీచరణ్ పేర్కొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ పరితోష్ పంకజ్




సంగారెడ్డి, ఆగస్టు 15: (నేటినిజం ప్రతినిధి): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాతృభూమి కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను తృణప్రాయంగా భావించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సాధించిన స్వాతంత్ర్యాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, విలువలను కాపాడుకోవాలని సూచించారు. దేశ భద్రతలో అంతర్గత భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జాతీయ పండుగలు మన విధులను, సమాజానికి అందించాల్సిన సేవలను గుర్తుచేసే వేడుకలని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని, సామరస్యం, ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నిబద్ధతతో, నిజాయితీగా విధులు నిర్వహించడం ద్వారా దేశ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, ఏఆర్ డీఎస్పీ ఎ. నరేందర్, వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి

నిజామాబాద్, ఆగస్టు 15:ఎడపల్లి మండలం అంబం గ్రామంలోని పోతాయి చెరువు వద్ద ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గంగమ్మ ఆలయం సమీపంలో నాగం చిన్న పోశెట్టి (46) మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు.

ఈ నెల 12న నిజామాబాద్‌లోని తన సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి చిన్న పోశెట్టి ఇంటి నుంచి వెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి మృతి చెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య నాగం సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగస్టు 13 నుంచి 19 వరకు దరఖాస్తులు..

సంగారెడ్డి, ఆగస్టు 15: (నేటినిజం ప్రతినిధి): పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు అండగా 'కేసీఆర్ ఉచిత కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన అర్హులైన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిపుణులతో ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. గతంలో నిర్వహించిన కేసీఆర్ ఉచిత శిక్షణా శిబిరాల ద్వారా పలువురు యువత పోలీసు కానిస్టేబుల్, వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారని హరీశ్‌రావు గుర్తుచేశారు. చదువుపై ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ ఖరీదైన కోచింగ్ ఫీజులు చెల్లించలేని నిరుద్యోగ యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో గత పదేళ్లుగా ఉచిత శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈసారి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఉచిత శిక్షణ అందించనున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సంబంధిత రంగాల్లో నిపుణుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు.

# స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ సాధన : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, ఆగస్టు 15:ఎందరో వీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం కొనసాగి రాష్ట్రాన్ని సాధించుకున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు.

మాజీ మంత్రి మాట్లాడుతూ దేశంలో ఇప్పటికి చాలా వర్గాల ప్రజలు చట్టసభల్లో అడుగు పెట్టలేదని, వారు అడుగుపెట్టిన రోజు అన్ని వర్గాలకు ఉపయోగపడే చట్టాలు వస్తాయని పేర్కొన్నారు. అంటరాని తనం, మహిళల పట్ల అత్యాచారాలు, కుల విభేదాలు, విద్వేషాలు ఇంకా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందని అన్నారు.

కులమతాలకు అతీతంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వె ల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

**–చిత్తూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం**
**–ప్రతి పేదింటికీ అండగా.. ప్రతి కుటుంబానికీ భరోసాగా**
**–వైద్యం.. విద్య.. వ్యవసాయానికి పెద్దపీట**
**–స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం**
**–స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్**



చిత్తూరు, ఆగస్టు 15 : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, చిత్తూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చిత్తూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి తన ప్రసంగంలో వివరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య రంగంలో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ ఆరోగ్య సేవల ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 10,34,288 మందికి సేవలు అందించామని చెప్పారు. ప్రజలకు వైద్యం మరింత చేరువ చేయడంతో పాటు ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని వివరించారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సత్యకుమార్ యాదవ్ అన్నారు. జిల్లాలో కొత్త కేంద్ర విద్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, వసతి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో చెరువులు, సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని చెప్పారు. సూక్ష్మ సాగునీటి పరికరాలు, వ్యవసాయ పరికరాలు, రాయితీలు అందించడంతో పాటు నీటి వనరులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సత్యకుమార్ యాదవ్ అన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో పాటు ఇతర గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతున్నా మని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆదాయ మార్గాలు పెంచేందుకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో రహదా రులు, తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి సౌకర్యాల మెరుగు దలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు, నైపుణ్యాభి వృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు.

# నందనం సొసైటీలో స్వాతంత్ర్య వేడుకలు



**జాతీయ జెండాను ఆవిష్కరించిన మార్నేని రవీందర్‌రావు**
**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి**
**దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి**

హన్మకొండ, ఆగస్టు 15:(నేటినిజం ప్రతినిధి) ఐనవోలు మండలం నందనం సొసైటీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నందనం సొసైటీ చైర్మన్, మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సమసమాజ స్థాపన, దేశ ప్రగతి కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

కార్యక్రమంలో సొసైటి వైస్ చైర్మన్ చందర్‌రావు, గ్రామ సర్పంచ్ రోజా, వార్డు సభ్యులు, వర్ధన్నపేట సొసైటీ చైర్మన్ రాజేష్ కన్నా, సీఈఓ సంపత్, సొసైటీ డైరెక్టర్లు సంపత్‌రావు, బుచ్చిరెడ్డి, మెట్టె చిరంజీవి, రాజారపు కుమార్, బిర్రు పద్మ, కలకోటి ఎలేంద్ర, చింతబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావొద్దని ప్రచారం చేయండి.. మహిళలతో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 15: స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకానికి ఏడాది పూర్తైన సందర్భంగా మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బస్సులో ప్రయాణించారు. పరేడ్ గ్రౌండ్స్ నుంచి బస్సులో ప్రయాణించి అనంతరం మహిళలతో సహా క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. స్త్రీశక్తి లబ్ధిదారులకు సీఎం.. తేనేటీ విందు ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలతో మాట్లాడుతూ.. వారి కుటుంబ వివరాలు.. ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి ఓట్లేయించుకునే వారిని నమ్మొద్దన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకూడదని మహిళలు ప్రచారం చేయాలని తెలిపారు.

## చంద్రబాబు ప్రశ్నలు.. మహిళల సమాధానాలు

రాబోయే 10 ఏళ్లలో ఏయే లక్ష్యాలను నిర్దేశించుకున్నారంటూ సీఎం ప్రశ్నలు వేశారు. కోటి రూపాయల పెట్టుబడితో తన డ్వాక్రా సంఘం నుంచి వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కడప జిల్లాకు చెందని ముస్లిం మహిళ తెలిపింది. ఏఐ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా తాను ఎంచుకున్న సాఫ్ట్‌వేర్ రంగంలో టాప్ పొజిషన్‌లోకి వెళ్లాలని విశాఖకు చెందిన ఓ ఉద్యోగిని వివరించింది. స్త్రీ శక్తి ద్వారా సుమారు రూ.3 వేలు ఆదా చేసుకోగలుగుతున్నామని యువతి తెలిపింది. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలతో మహిళలే ఎక్కువగా సంపాదిస్తున్నారని.. తాము కూడా మరికొందరికి ఉపాధి చూపగలుగుతున్నామన్న పలువురు మహిళలు చెప్పుకొచ్చారు. అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని మహిళలు కోరగా.. రాజధానిలో మహిళల పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## అదే ప్రభుత్వ లక్ష్యం..

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... స్త్రీ శక్తి పథకం ప్రారంభించి నేటితో ఏడాది అయిందని.. ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. వివిధ ప్రాంతాలకు ఉచితంగా మహిళలు వెళ్లే వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళల డబ్బులను ఆదా చేసుకోగలుగుతున్నారన్నారు. 'రాబోయే రోజుల్లో అందరి ఆదాయం పెరగాలి.. అందరి ఆరోగ్యం బాగుండాలి. అప్పుడే అందరూ సంతోషంగా ఉంటారు... దీన్ని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం. బాగా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. వారిని ఆదుకునేలా... వారిలో చైతన్యం కలిగించేలా చేస్తున్నాం. అందరూ చదువుకుంటే మెరుగైన ఆలోచనలు వస్తాయి.. మంచి ఆలోచనలు వస్తే అభివృద్ధి అవుతారు. ఆ దిశగా మేం కృషి చేస్తున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నాం' అని చెప్పారు.

## ప్రజారోగ్యం కోసం పని చేస్తున్నాం..

ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజారోగ్యం బాగుండేందుకు తీసుకోవాల్సిన ఆహారాన్ని కూడా ప్రచారం చేస్తున్నామని సీఎం వెల్లడించారు. మహిళలు అంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేదని.. కానీ ఇప్పుడు ఇది రివర్స్ అయిందన్నారు. మహిళలే ఎక్కువగా సంపాదించే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజల కోసం అభివృద్ధి-సంక్షేమానికి ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. సంజీవని వంటి పథకాలతో ప్రజారోగ్యం కోసం పని చేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు.. ఆర్థిక పరిస్థితులు మెరుగపడేలా వివిధ రకాల పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకోవాలి... డ్వాక్రా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలి... ఆర్థికంగా ప్రగతి సాధించాలని పిలుపునిచ్చారు.

## డ్వాక్రా సంఘాలను తెచ్చా.. ప్రోత్సహించా

పీ4 పథకం ద్వారా కూడా పేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా మార్గదర్శులను ముందుకు తెస్తున్నామని సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాలను తెచ్చానని.. ప్రోత్సహించానని తెలిపారు. రూ. 25 వేల కోట్లు డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉందని చెప్పారు. తీసుకున్న బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లింపులు జరుపుతారన్నారు. కొన్ని పెద్ద కంపెనీలు కూడా రుణాలను ఎగవేస్తున్నాయని, డ్వాక్రా మహిళలు మాత్రం తీసుకున్న రుణాలను ఠంచనుగా చెల్లింపులు జరిపారని వెల్లడించారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశామన్నారు. ఇప్పుడు గంజాయి, బ్లేడ్ బ్యాచులను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు, అవగాహన పెంచేందుకు మహిళలు చొరవ తీసుకోవాలన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిని మహిళలు ఓ కంట కనిపెడుతూ ఉండాలని తెలిపారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని సమాజంలో అశాంతిని రేకెత్తించే వారిని దూరం పెట్టే చైతన్యం ప్రతి ఒక్కరిలోనూ రావాలన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని భావిస్తుంటే... శాంతి భద్రతలకు విఘాతం కలిగించి మహిళలను కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శలు గుప్పించారు.

# ఉత్తమ ఉద్యోగిగా జుక్కల్ ఎంపీడీఓ

**-కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం**
**ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు గుర్తింపు**
**ఎంపీడీఓకు అభినందనలు తెలిపిన ప్రజాప్రతినిధులు, ప్రజలు**

కామారెడ్డి, ఆగస్టు 15:(నేటినిజం ప్రతినిధి)జుక్కల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బి. శ్రీనివాస్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు. జుక్కల్ మండలంలో ఎంపీడీఓ బి. శ్రీనివాస్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, సంక్షేమ పథకాల అమలులో చురుకుగా పనిచేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు ఈ గుర్తింపు లభించింది. ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఎంపీడీఓ శ్రీనివాస్‌కు జుక్కల్ మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

# పుంభావ సరస్వతి వానమామలై

## ఆగస్టు 16... వానమామలై వరదాచార్యులు జయంతి



తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంధస్థం చేయడం విశేషమే మరి.

వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా.

ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు.

1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు.

అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు.

తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు.

పోతన చరిత్రము" వ్రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు,

ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుర్రకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము".

మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే.

అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది.

ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే.

వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు.

ఇతని శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు.

క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## -జాతీయ జెండా ఆవిష్కరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



కరీంనగర్, 15 (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం రోజు పంద్రాగస్టు స్వాతంత్ర్య వేడుకలను కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి గీతాలు, 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభ్యున్నతి కోసం, భవిష్యత్తు తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉండి ముందుకు కొనసాగాలని తెలిపారు. . 'వికసిత్ భారత్' లక్ష్యంగా దేశం ముందుకెళ్తోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ జి. రమేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు , 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మీడియా సెల్ కన్వీనర్ లోకేశ్, ఉప్పర పల్లి శ్రీనివాస్ , కార్పొరేటర్లు, బిజెపి రాష్ట్ర ,జిల్లా నాయకులు కార్యకర్తలు ,వివిధ మోర్చా బాధ్యులు, మండల, నగర జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. 39వ డివిజన్లో జాతీయ జెండా ఎగరవేసిన కార్పొరేటర్ మాసం గణేష్ 39వ డివిజన్ గాంధీ చౌరస్తాలో జెండా ఆవిష్కరించిన కార్పొరేటర్ మాసం గణేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. డివిజన్‌లో మొట్టమొదటిసారిగా జెండా ఎగరవేయడం తనకు జీవితంలో మరపురాని అనుభూతినిచ్చిందని కార్పొరేటర్ మాసం గణేష్ తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత మరియు సమగ్రత కోసం అందరూ ఐకమత్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అశోక్ నగర్ లో స్వాతంత్ర వేడుకలు , బి ఎల్ వో లకు సన్మానం.. కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ గొట్టే ముక్కుల ఉమారాణి వెంకటరమణ ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. ఇటీవల ఎస్ఐఆర్ విధులను అత్యంత సక్రమంగా నిర్వహించి, ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవెల్ ఆఫీసర్లను ఈ వేదికపై ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు.

### బిజెపి నేత తోట సాగర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

కరీంనగర్ పట్టణం 7 వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీ లో కాంటెస్టెడ్ కార్పొరేటర్ , స్థానిక బిజెపి నేత తోట సాగర్ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ ఇండోర్ స్టేడియంలో చేపట్టిన వన మహోత్సవం ప్రోగ్రామ్స్ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్సిపల్ అడిషనల్ కమిషనర్ తో బీజేపీ నాయకులు తోట సాగర్ , కాలనీ పెద్దలు, బీజేపీ నాయకులు కలిసి మొక్కలు నాటారు.

# శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకోవడం జరిగింది. విద్యార్థులు నృత్యాలతో పాటలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి మాట్లాడుతూ భారతదేశ చరిత్ర గురించి స్వాతంత్రం యొక్క అవసరం గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ స్వాతంత్ర యొక్క గొప్పతనాన్ని మరియు స్వతంత్ర సమరయోధుల యొక్క త్యాగాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమీకు కోఆర్డినేటర్స్ సునీల్ కుమార్గారు,మమతా , ప్రిన్సిపాల్ సుదేశీ , మమత , డిన్ అంజయ్య , సి బ్యాచ్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ ప్రవళిక , శివాని ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ హరీష, అరుణ , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్ , పిటి సుధాకర్, మారుతి, కవిత మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# అవినీతిని అస్సలు ఉపేక్షించవద్దని సీఎం విజయ్ పిలుపు



చెన్నై, ఆగస్టు 15: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చెన్నైలోని చరిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్ ప్రాంగణంలో నిర్వహించిన తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రసంగం ప్రారంభంలోనే జెన్ జీ (ఉవని జి) యువతను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'వణక్కమ్ జెన్ జీ' అని పలకరించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నా తమిళ బంధువులకు, జెన్ జీ మిత్రులకు నా వణక్కమ్' అని విజయ్ పేర్కొన్నారు. ఈ వేడుకలో విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఎ. చంద్రశేఖర్, శోభలతో పాటు నటి త్రిష మొదటి వరుసలో ఆసీనులయ్యారు.

రాష్ట్ర హక్కుల పరిరక్షణ: కేంద్ర ప్రభుత్వానికి పరిపాలనాపరమైన అంశాల్లో పూర్తి సహకారం అందిస్తూనే, రాష్ట్ర హక్కులకు భంగం కలిగించే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

అవినీతిపై ఉక్కుపాదం: అవినీతి రహిత పాలనే నిజమైన స్వాతంత్ర్యమని, ప్రభుత్వ ఆదాయం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నామని తెలిపారు. అవినీతిని అంతమొందించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని చెప్పారు.

ప్రత్యర్థులకు హెచ్చరిక: తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న శక్తులను, కుట్రలను కచ్చితంగా తిప్పికొడతామని హెచ్చరించారు.

గత సంక్షేమ పథకాల కొనసాగింపు: ప్రజలకు ఉపయోగపడే పాత పథకాలను తాము కొనసాగిస్తున్నామని చెబుతూ, ఏఐఏడీఎంకే ప్రవేశపెట్టిన 'అమ్మ ఉణవగం' (అమ్మ క్యాంటీన్లు), డీఎంకే తీసుకొచ్చిన పాఠశాల విద్యార్థుల 'టిఫిన్ పథకం' వంటి వాటిని ఉదాహరణగా ప్రస్తావించారు.

### కొత్త పథకాలు.. వరాల జల్లులు

తాయ్‌మామన్ తంగ మోదిరం థిట్టమ్: ద్రావిడ సిద్ధాంతకర్త సీ.ఎన్. అన్నాదురై జయంతి సందర్భంగా సెప్టెంబర్ 15న రూ. 755.83 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే నవజాత శిశువులకు బంగారు ఉంగరం ఇచ్చే పథకాన్ని ప్రారంభించనున్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

## ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి.. వందనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి,



సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తదితరులు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, చేనేత జౌళి శాఖ, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, అగ్ని మాపక శాఖ, ఆర్టీసీ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, పౌర సరఫరాల, సర్వే అండ్ రెవెన్యూ శాఖ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పనులు, వివరాలు, పథకాలతో రూపొందించిన శకటాలు ప్రదర్శించారు. అలాగే గ్రామీణ అభివృద్ధి శాఖ, వ్యవసాయ, ఉద్యానవన, పోలీస్ శాఖ, 17వ బెటాలియన్, అటవీ శాఖ, లీడ్ బ్యాంక్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తదితరులతో కలిసి పరిశీలించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, మంచి శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు అందజేసి .. అభినందించారు. స్త్రీ నిధి ద్వారా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఈ స్కూటీ, ఈ ఆటో లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ అతిథులతో కలిసి పంపిణీ చేశారు. రూపాయలు లక్ష విలువైన ఈ స్కూటీలు 24 మందికి, రూపాయలు 14 లక్షల 25 వేల విలువైన ఈ ఆటోలను అందజేశారు. 855 మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ. 100 కోట్ల 12 లక్షలు, అలాగే 847 సంఘాలకు స్త్రీ నిధి రూ. 20 కోట్ల 66 లక్షల రుణాలను పంపిణీ చేశారు. టీవీ సీ సీ స్కీమ్ కింద జిల్లాలోని పలువురు దివ్యాంగులకు ఆటో, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దుంపేటి కుమారస్వామికి ఎలక్ట్రిక్ ఆటో, గుర్రంవాణిపల్లికి చెందిన కంది తిరుమల్ రెడ్డి, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరే పరశురాముకు హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఏవో రాంరెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ విశ్వనాథ శాస్త్రి
రంగులూ, ఫిరంగులూ
సంకలనం : ఏ.వి. రమణమూర్తి
పుస్తక పరిచయ సభ
సభాధ్యక్షత
నారాయణ వేణు మిత్రసాహితి
గౌరవ అతిథులు
డాక్టర్ వేమూరి కృష్ణమూర్తి
రాచకొండ ఉమాకుమార శాస్త్రి
పుస్తక పరిచయం
జి.ఎస్. చలం
సంకలనకర్త స్పందన
ఏ.వి. రమణమూర్తి
అందరూ ఆహ్వానితులే

అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం
డాబా గార్డెన్స్
విశాఖపట్నం
16.8.2026
ఆదివారం
ఉదయం
10.00 నుండి
1.00 వరకు
నిర్వహణ
మిత్ర సాహితి
విశాఖపట్నం

# పట్టణ బిజెపి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 15:(నేటినిజం ప్రతినిధి): దేశస్వాతంత్ర దినోత్సవం వేడుకలు శనివారం బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి పార్టీ కార్యాలయంలో ఘనంగా జాతీయ జెండ ఆవిష్కరించారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షులు రా పె ల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపుమేరకు గత మూడు రోజులుగా హర్ ఘర్ తీరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూనే వేములవాడ అంటే రామన్న రామన్న అంటే బిజెపి అనే ముద్ర ఉన్నప్పటికీ సనాతన ధర్మ మరియు ఆధ్యాత్మిక శోభ మాత్రమే కాకుండా జాతీయ భావాన్ని పెంపొందించే విధంగా 80 జెండాల ఆవిష్కరణ కార్యక్రమంలో కార్యకర్తలు అందరిని పుర ప్రముఖుల అందరిని మమేకం చేస్తూ ప్రతి ఒక్కరిచే ఒక జెండా ఆవిష్కరింపజేసిన ప్రతాప రామకృష్ణ కి కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ పట్టణ ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ఈ దేశం మన అందరిదీ ఒకప్పుడు జాతీయ జెండా ఎగురవేయాలంటే ఎన్నో ఆంక్షలుండేటివి బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసే అవకాశాన్ని ఇవ్వడం జరిగింది ఈ దేశ రక్షణకు ప్రతి ఒక్కరం నరేంద్ర మోడీకి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ మనోహర్ డాక్టర్ రాధాకృష్ణ రాష్ట్ర బిజెపి నాయకులు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ రేగుల రాజ్ కుమార్ ,కౌన్సిలర్స్ వంగల శ్రీనివాస్ కొండేపు ముత్యం మైలారం శ్రీనివాస్ నాయకులు రేగుల మల్లికార్జున్ సంటి అంజిబాబు పిన్నింటి హనుమాన్లు సుదర్శన్ యాదవ్ రేగుల శ్రీకాంత్ బండ మల్లేశం వైభవ్ బాలరాజు బోనాల శివ వివేక్ రెడ్డి నామాల శేఖర్ జవ్వాజి శేఖర్ వెంకటస్వామి అశోక్ వాసనీ మల్లేశం గుడిసె మనోజ్ చిన్నయ్య తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.